సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
మంగళవారం । 13 । డిసెంబర్ । 2022

భారీగా శ్రీనృసింహ దీక్ష స్వీకరణ

మన్యంలో ఆధ్యాత్మికత పరిఢవిల్లుతోం ది. సింహాద్రి మఠం ఆధ్వర్యంలో సోమవారం మన్యం ప్రాతంలో 32 రోజుల శ్రీనృసింహ దీక్షను గిరిజనులు స్వీకరించారు. ముంచంగిపుట్‌లో 415 మంది, చింతపల్లి మండలం చిక్కుడుబట్టిలో 364 మంది, పాడేరు మోదకొండమ్మ ఆలయంలో 71 మంది దీక్ష స్వీకరించారు.

10లో



ప్రకృతి వ్యవసాయమే లాభదాయకం



ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు ఆసక్తి చూపిస్తున్నారు. ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం సైతం విరివిగా ప్రోత్సహిస్తోంది. దీనిపై ఏయూ అర్థశాస్త్ర పరిశోధక విద్యార్థి చెట్టి ప్రవీణ్ కుమార్ విజయనగరం జిల్లాలో పరిశోధన చేశారు.

10లో

న్యూస్‌రీల్

రంపచోడవరం ఏఎస్పీగా అధిరాజ్‌సింగ్ రాణా



రంపచోడవరం: రంపచోడవరం ఏఎస్పీగా అధిరాజ్‌సింగ్ రాణా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. 2018 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన ఈయన ఏడాది పాటు గ్రేహౌండ్స్ అసాల్ట్ కమాండెంట్‌గా పనిచేశారు. తొలి పోస్టింగ్‌గా ఇక్కడ ఏఎస్పీగా విధుల్లో చేరారు. ఇప్పటి వరకు చింతూరు ఏఎస్పీ మహేశ్వరరెడ్డి ఇన్‌చార్జిగా వ్యవహించారు. నూతన ఏఎస్పీ మాట్లాడుతూ ఏజెన్సీలో శాంతిభద్రతల పటిష్టతతోపాటు గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు. కమ్యూనిటీ పోలీసింగ్‌ను గ్రామస్థాయిలో అమలు చేస్తూ సమస్యలను పరిష్కరిస్తానన్నారు.

నేటి నుంచి జగనన్న స్వర్ణోత్సవ సాంస్కృతిక సంబరాలు

మహారాణిపేట(విశాఖ దక్షిణ): రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి ఆధ్వర్యంలో జగనన్న స్వర్ణోత్సవ సాంస్కృతిక సంబరాలు మంగళవారం నుంచి మూడు రోజుల పాటు విశాఖలో జరగనున్నాయి. ఇందులో భాగంగా వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో జోనల్ స్థాయి పోటీలు నిర్వహిస్తారు. విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలకు చెందిన కళాకారులు ఈ పోటీల్లో పాల్గొంటారు. ప్రతి విభాగంలో విజేతలకు గ్రూపునకు రూ.25 వేలు చొప్పున అందజేస్తారు. రాష్ట్ర యువజన, పర్యాటక, సాంస్కృతిక విభాగాల శాఖ మంత్రి ఆర్.కె.రోజా అధ్యక్షత జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా స్పీకర్ తమ్మినేని సీతారాం, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజని, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, ధర్మాన ప్రసాదరావు, బొత్స సత్యనారాయణ, సీదిరి అప్పలరాజు తదితరులు పాల్గొంటారు. ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు హాజరవుతారు.

నేడు అప్పన్న ట్రస్ట్‌బోర్డు సమావేశం



ఈవోకు అజెండాలో చేర్చాల్సిన అంశాలపై వినతి పత్రాన్ని అందజేస్తున్న ట్రస్ట్‌బోర్డు సభ్యులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సమావేశం మంగళవారం జరగనుంది. సింహాచలం దేవస్థానానికి చెందిన శ్రీకృష్ణాపురంలోని గోశాలలో ఉదయం 10.30 గంటల నుంచి ట్రస్ట్‌బోర్డు సమావేశాన్ని నిర్వహించనున్నారు. మొత్తం 38 అంశాలతో రూపొం దించిన అజెండాలోని అంశాలపై బోర్డు సభ్యులంతా చర్చించనున్నారు. అజెండాలో పెట్టిన అంశాలు దేవస్థానంలో ఇప్పటికే జరిగిపోయిన కొన్ని పనులు, చేయాల్సిన ఇంజినీరింగ్ వర్క్స్, రానున్న ముక్కోటి ఏకాదశికి ఏర్పాట్ల పనులకు సంబంధించినవే. సోమవారం ట్రస్ట్‌బోర్డు సభ్యులంతా దేవస్థానం ఈవో వి.త్రినాథరావుతో గోశాలలోనే ముందస్తు సమావేశం నిర్వహించారు. కేవలం ఇంజినీరింగ్‌కి సంబంధించిన పనులు మాత్రమే ఉన్నాయని, భక్తుల సౌకర్యార్థం చేయాల్సిన పనులు లేవని నిరుత్సాహం వ్యక్తం చేశారు. అలాగే ప్రభుత్వ ఆదేశాల మేరకు దేవస్థానం భూములను కాపాడేందుకు కొన్ని కీలక నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందని ఈవో ముందుంచారు. వాటిని కూడా అజెండాలో చేర్చి చర్చించాలన్నారు. సంబంధిత అంశాలతో కూడిన వినతిపత్రాన్ని ఈవోకు అందజేశారు. ట్రస్ట్‌బోర్డు సభ్యులు వారణాసి దినేష్‌రాజ్, గంట్ల శ్రీనుబాబు, సంపంగి శ్రీనివాసరావు, దొడ్డి రమణ, కృష్ణమూర్తి పాత్రుడు, సువ్వాడ శ్రీదేవి, పెనుమత్స శ్రీదేవివర్మ, వంకాయల సాయునిర్మల, ముదుండి రాజేశ్వరి, పంచాడి పద్మ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ సీవీవోగా కరుణరాజు



ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్ నూతన చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ (సీవీవో)గా డాక్టర్ సిర్రా కరుణరాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సీఎండీ అతుల్ భట్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. తన కార్యాలయంలో సీనియర్ అధికారులతో కొద్దిసేపు సమావేశమయ్యారు. 1998 బ్యాచ్ ఐఏఎస్ కరుణరాజు పంజాబ్ క్యాడర్‌కు చెందిన వారు. ఐదేళ్లగా పంజాబ్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తూ ఇక్కడకు వచ్చారు.

సాహస పర్యాటకానికి సాహో

- బొర్రాగుహల నుంచి కొయిటగూడ వరకు జిప్‌లైనర్
- వారం రోజుల్లో పనులు ప్రారంభించనున్న జస్టిన్ సంస్థ
- పర్యాటకులకు సరికొత్త అనుభూతి



సాక్షి, విశాఖపట్నం: ప్రకృతి అందాలతో అలరారే పర్యాటకాన్ని కొత్త పుంతలు తొక్కేందుకు సరికొత్త ఆలోచనలతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తోంది. ఎత్తయిన తూర్పు కనుమల అందాలు ప్రపంచ సందర్శకుల్ని కట్టిపడేస్తుండగా.. అంతర్జాతీయ పర్యాటక పటంలో ఆంధ్రా ఊటీకి ప్రత్యేక స్థానం కల్పించేందుకు విభిన్న ప్రాజెక్టులకు ప్రణాళికలు రచిస్తోంది. దేశీ, విదేశీ పర్యాటకులను మంత్రముగ్ధులను చేస్తున్న బొర్రా గుహల వద్ద.. సాహస పర్యాటకానికి సాహో అనేలా జిప్‌లైనర్ ఏర్పాటు చేస్తున్నారు. గుహల నుంచి కింద ఉన్న గూడెం తండా వరకూ విహరించేలా ఏర్పాటుకానున్న జిప్‌లైనర్ పనులను మరో వారం రోజుల్లో ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.

గుహల నుంచి గూడెం వరకు..

సముద్రమట్టానికి 1,400 మీటర్ల ఎత్తులో సుమారు 150 మిలియన్ ఏళ్ల క్రితం ఏర్పడిన సహజ సిద్ధ ప్రకృతి అందాలు బొర్రా గుహలు. నీటి ప్రవాహం వల్ల ఏర్పడిన ఈ గుహలు పర్యాటకులను మంత్రముగ్ధుల్ని చేస్తున్నాయి. అనంతగిరి ప్రాంతంలో ఉన్న బొర్రా గుహలను చూసేందుకు ఏటా సుమారు లక్షల మంది దేశ విదేశీ పర్యాటకులు వస్తుంటారంటే.. ఇవి ఎంత ప్రసిద్ధి చెందాయో అర్థం చేసుకోవచ్చు. అందుకే వీటిని చూసేందుకు వస్తున్న పర్యాటకులకు మరింత అనుభూతిని అందించేందుకు పర్యాటక శాఖ అడ్వెంచర్ టూరిజం ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఎత్తయిన బొర్రా గుహల నుంచి కింద ఉన్న గిరిజన గ్రామం సరిహద్దు వరకూ జిప్‌లైనర్ ఏర్పాటు చేసి సాహస పర్యాటకానికి చిరునామాగా మార్చేందుకు ఏర్పాట్లు చేస్తోంది.

300 మీటర్ల పొడవునా..

బొర్రా గుహల వద్ద ఉన్న రెస్టారెంట్ ప్రాంతం నుంచి కిందకు వెళ్లేలా ఈ జిప్‌లైనర్‌ని ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే టెండర్లు ఖరారయ్యాయి. విశాఖకు చెందిన జస్టిన్ జోసెఫ్‌కు చెందిన సంస్థకు రూ.35 లక్షల వ్యయంతో ఈ బాధ్యతలు అప్పగించారు. సుమారు 300 మీటర్ల పొడవునా ఈ జిప్‌లైనర్ రానుంది. కింద ఉన్న కొయిటగూడ వరకూ గాల్లో విహరిస్తూ వెళ్లేలా దీన్ని ఏర్పాటు చేయనున్నారు. గుహల నుంచి కిందకు వెళ్తున్నప్పుడు దట్టమైన అడవి వ్యూ కూడా కనిపిస్తుంటుంది. రిజర్వ్ ఫారెస్ట్ పై నుంచి వెళ్తున్నందున, అటవీ శాఖ అనుమతులు తప్పనిసరి కావడంతో దానికి టూరిజం అధికారులు దరఖాస్తు చేసుకున్నారు. ఆ అనుమతులు రాగానే పనులు ప్రారంభించనున్నారు. కేవలం 30 రోజుల వ్యవధిలోనూ పనులు పూర్తి చేసి, సేవలు ప్రారంభించేందుకు టూరిజం అధికారులు వడివడిగా అడుగులు వేస్తున్నారు.

7.73 ఎకరాల డీ-పట్టా భూములకు పరిహారం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా జిల్లాలో ఉన్న అపార అవకాశాల్ని మెరుగు పరుచుకొని పర్యాటక ప్రాంతాల అభివృద్ధి పనులకు రూపకల్పన జరుగుతోంది. ఇందులో భాగంగా బొర్రా వద్ద జిప్‌లైనర్ ఏర్పాటు చేస్తున్నాం. జిప్‌లైనర్‌తో పాటు ఇతర సౌకర్యాల కోసం 7.73 ఎకరాల డీ–పట్టా భూముల్ని సమీకరించాం. గయాలు భూముల్ని ఆక్రమించుకొని రైతులు అనుభవిస్తున్నప్పటికీ.. వారికి నష్టం కలిగించకూడదనే ఉద్దేశంతో కలెక్టర్ సుమిత్ ఆధ్వర్యంలో మొత్తం ఆరుగురు గిరి రైతులకు పరిహారం కూడా చెల్లించాం. త్వరలోనే జిప్‌లైనర్ పనులు ప్రారంభించనున్నాం.

–శ్రీనివాస్ పాణి, టూరిజం రీజనల్ డైరెక్టర్

మన్యంలో అధికంగా రక్తదాన శిబిరాలు

రెడ్ క్రాస్ సంస్థ జిల్లా వైస్ చైర్మన్ గంగరాజు



ముంచంగిపుట్టులో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న రెడ్‌క్రాస్ సంస్థ ప్రతినిధులు

ముంచంగిపుట్టు: మన్యంలో రెడ్ క్రాస్ సంస్థ ద్వారా రక్తదాన శిబిరాలు అధికంగా నిర్వహిస్తామని ఆ సంస్థ జిల్లా వైస్ చైర్మన్ ఎస్.గంగరాజు తెలిపారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాల మేరకు ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎంపీడీవో కిరణ్‌కుమార్, తహసీల్దార్ నర్సమ్మ ఈ శిబిరాన్ని ప్రారంభించారు. పలు శాఖల అధికారులు, సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు, వీఆర్వోలు పాల్గొని రక్తదానం చేశారు. వీరికితోడు ఎంపీడీవో సైతం రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా సంస్థ జిల్లా వైస్ చైర్మన్ గంగరాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడం కోసం ముందుకు రావాలని కోరారు. జిల్లాలో రక్తదాన శిబిరాలు నిర్వహణకు కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ ప్రోత్సాహం అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో పాడేరు జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ కె.కృష్ణారావు, పాలకవర్గ కమిటీ సభ్యులు లోహితాస్, టెక్నికల్ సూపర్‌వైజర్లు రాజుబాబు, వెంకట్, సత్తిబాబు పాల్గొన్నారు.

16న జాబ్‌మేళా

కంచరపాలెం(విశాఖ ఉత్తర): స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీయర్ సర్వీస్ సెంటర్‌లో ఈనెల 16న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా సబ్ రీజినల్ ఎంప్లాయ్‌మెంట్ (ఎస్సీ,ఎస్టీ) అధికారి నిట్టల శ్యామ్‌సుందర్ తెలిపారు. బజాజ్ క్యాపిటల్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో 50 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. ఇంటర్, డిగ్రీ, ఎంబీఏల్లో ఉత్తీర్ణత సాధించి 18–30 ఏళ్ల పురుష, మహిళా అభ్యర్థులు అర్హులన్నారు. నెలకు రూ. 11 వేల నుంచి రూ.18 వేల జీతం ఉంటుందన్నారు. ncs.gov.inలో రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు.

డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో..

ఎంవీపీకాలనీ: గాజువాక ఆర్టీసీ డిపో దరి ఏఎస్‌బీసీ, ఎస్‌బీవీపీ డిగ్రీ కళాశాలల్లో 16వ తేదీన దివ్యాంగులు, మహిళలకు ఉద్యోగ మేళా నిర్వహించనున్నారు. 15 కంపెనీల్లో 455 ఉద్యోగాల భర్తీకి మేళా జరగనుంది.

కాసులు కురిపిస్తున్న ఆయిల్ పామ్ సాగు

- ఎకరాకు 10 నుంచి 15 టన్నుల దిగుబడి
- పెట్టుబడి పోను రూ.90 వేల వరకు ఆదాయం



జడ్డంగి కొనుగోలు కేంద్రంలో ఆయిల్ పామ్ గెలలకు తూకం వేస్తున్న దృశ్యం

రాజవొమ్మంగి: ఆయిల్ పామ్ తోటలు కాసులు కురిపిస్తున్నాయి. ఎకరా భూమిలో సాగు చేస్తే ఏడాదికి 10 నుంచి 15 టన్నుల ఆయిల్ పామ్ గెలల దిగుబడి వస్తోంది. ప్రస్తుతం టన్ను మార్కెట్ ధర (నవంబర్‌లో) రూ. 13,700 ఉండగా, పెట్టుబడి పోను ఏడాదికి రూ.80 నుంచి 90 వేల ఆదాయం సమకూరుతున్నట్లు రైతులు చెబుతున్నారు. మిగతా వాణిజ్య పంటలలో ఈ అవకాశం లేదంటున్నారు. ఈ నేపథ్యంలో మండలంలో 150 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగవుతోంది. కోతులు, ఇతర పశువుల బెడద లేని ఈ సాగుపై రైతులు రాను రాను ఆసక్తి చూపిస్తున్నారు.

ఒకే సారి పెరిగిన ధర

ఇటీవల రష్యాకు – ఉక్రెయిన్‌కు జరిగిన యుద్ధ సమయంలో ఆయిల్ పామ్ ధర అమాంతం పెరగడం రైతులకు ఎంతో ఊరటనిచ్చింది. ఆ సమయంలో (జూన్/జూలైలో) ఆయిల్ పామ్ గెలలు టన్ను రూ.22 వేల నుంచి రూ.23 వేల వరకు పెరగడంతో పండగ చేసుకున్నారు. తిరిగి ధర యధాస్థితికి (రూ. 13 వేలు) దిగిపోయినప్పటికి గిట్టుబాటు బాగానే ఉందని చెబుతున్నారు. ప్రభుత్వం సాగునీటి బోర్లను ఏర్పాటు చేసి, ఆయిల్ పామ్ సాగులో గిరిజన రైతులను ప్రోత్సహించాలని కోరుతున్నారు.

మలేరియా పరిశోధనలో 'సూపర్'వైజర్

భీమవరం పీహెచ్‌సీ ఉద్యోగి రామచందర్‌కు పురస్కారం



హైదరాబాద్ ఓయూలో పురస్కారం అందుకుంటున్న గోల్లోరి రామచందర్

అనంతగిరి: మలేరియా మహమ్మారిపై పరిశోధనలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు మండలంలోని భీమవరం పీహెచ్‌సీ మలేరియా యూనిట్ సూపర్‌వైజర్ గోల్లోరి రామచందర్‌కు పురస్కారం వరించింది. కేసులు నమోదు గల కారణాలపై పరిశోధించినందుకు ఎంపికయ్యారు. ఈ మేరకు ఏపీ, తెలంగాణకు సంబంధించి హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో డిపార్టుమెంట్ ఆఫ్ జువాలజీ కాలేజ్ ఆఫ్ సైన్స్ ఆధ్వర్యంలో సోమవారం 15వ అంతర్జాతీయ కాన్ఫరెన్స్ ఆఫ్ మెడికల్ ఆర్థోపాడోలజీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మలేరియా యూనిట్ సూపర్‌వైజర్ గోల్లోరి రామచందర్ పురస్కారం అందుకున్నారు.

మలేరియా కేసులు తగ్గుముఖం

ఏజెన్సీలో భీమవరం పీహెచ్‌సీ పరిధిలోనే మలేరియా కేసులు అధికంగా నమోదయ్యేవి. దీనిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి వైద్య శాఖను అప్రమత్తం చేసింది. దాంతో జిల్లా మలేరియా నివారణ అధికారి ద్వారా కేసులు అధికంగా నమోదవుతున్న గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ముందస్తుగానే దోమల నివారణ మందు పిచికారీ, దోమ తెరలు పంపిణీ, ఎప్పటికప్పుడు వైద్య శిబిరాలు నిర్వహించడంతో ప్రస్తుతం కేసులు తగ్గుముఖం పట్టాయి.

హోంగార్డు డీఎస్పీగా ఏడుకొండలరెడ్డి బాధ్యతల స్వీకరణ



సీపీ శ్రీకాంత్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన హోంగార్డు డీఎస్పీ ఏడుకొండలరెడ్డి

దొండపర్తి(విశాఖ దక్షిణ): హోం గార్డు డీఎస్పీగా దుండి ఏడుకొండలరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన నగర పోలీస్ కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. 1991లో ఏఆర్‌పీసీగా పోలీస్ శాఖలో చేరిన ఏడుకొండలరెడ్డి అంచెలంచెలుగా పదోన్నతులు పొందుతూ ఇటీవలే డీఎస్పీగా నియమితులయ్యారు. దీంతో ప్రభుత్వం ఆయనను విశాఖ హోం గార్డు డీఎస్పీగా ఏడుకొండలరెడ్డిని నియమించింది. విశాఖ, అనకాపల్లి, అల్లూరి, కాకినాడ, రాజమండ్రి, అమలాపురం జిల్లాలకు ఆయన ఇన్‌చార్జిగా వ్యవహరించనున్నారు. విధి నిర్వహణలో భాగంగా ఆంధ్రా, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాల్లోని అడవుల్లో సుమారు లక్ష కిలోమీటర్లకుపైగా నడిచిన వ్యక్తిగా ఆయన పేరుగాంచారు.

కాఫీ రైతులకు గిట్టుబాటు ధరలు

కలెక్టర్ సుమిత్ కుమార్



పెదవలసలో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

గూడెంకొత్తవీధి: కాఫీ పండించే గిరిజన రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించేందుకు ప్రభుత్వ పరంగా అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటున్నామని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. మండలంలోని పెదవలస, సంకాడ గ్రామాల్లో కాఫీ సాగు చేస్తున్న రైతులతో సోమవారం ఆయన మాట్లాడారు. ఇప్పటికే జీసీసీ పార్చిమెంటు, చెర్రీకి మంచి ధరలు ప్రకటించిందన్నారు. ఐటీడీఏ ద్వారా ఏర్పాటైన మాక్స్ ద్వారా కిలో కాఫీ పండ్లకు రూ.36 ధర చెల్లిస్తున్నామన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో కాఫీ ఏడీ అశోక్ పాల్గొన్నారు.

కాఫీ కొనుగోలు లక్ష్యాలు అధిగమించాలి

చింతపల్లి: కాఫీ కొనుగోలు లక్ష్యాలు అధిగమించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. సోమవారం స్థానిక ఏకో పల్పింగ్ యూనిట్‌ను ఆయన సందర్శించారు. కాఫీ పండ్లను పల్పింగ్ చేసి మ్యాక్స్ ద్వారా అంతర్జాతీయ ధరలకు విక్రయించేందుకు చర్యలు చేపడతామన్నారు. అక్కడ విక్రయించగా వచ్చిన లాభాల్లో గిరిజన రైతులకు బోనస్ చెల్లిస్తామన్నారు. ఇప్పటి వరకు 180 మెట్రిక్ టన్నులు కాఫీ పండ్లు కొనుగోలు చేశామన్నారు. జి.మాడుగుల, గూడెంకొత్తవీధి మండలాల్లో పల్పింగ్ యూనిట్ల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. పార్చిమెంట్ కిలో రూ.270 కొనుగోలు చేస్తున్నామన్నారు. అనంతరం కాఫీ లైజన్ వర్కర్లతో సమావేశం నిర్వహించారు. కాఫీ రైతుల్లో మరింత అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీహరికోట విజ్ఞాన యాత్రకు గిరిజన విద్యార్థులు

ఈ యాత్ర చరిత్రాత్మకం : పాడేరు, అరకు ఎమ్మెల్యేలు భాగ్యలక్ష్మి, పాల్గుణ



బస్సులకు జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణ, పీవో గోపాలకృష్ణ

సాక్షి, పాడేరు: శ్రీహరికోటకు గిరిజన విద్యార్థుల విజ్ఞానయాత్ర ఐటీడీఏ చరిత్రలోనే చరిత్రాత్మకమని పాడేరు, అరకు ఎమ్మెల్యేలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణ సంతోషం వ్యక్తం చేశారు. పాడేరు ఐటీడీఏ పరిధిలోని 120 మంది గిరిజన విద్యార్థులకు ప్రభుత్వ ఆదేశాల మేరకు శ్రీహరికోట విజ్ఞాన యాత్రను అధికారులు ఏర్పాటు చేశారు. అన్ని సౌకర్యాలతో కూడిన మూడు ఆర్టీసీ బస్సుల్లో విజ్ఞాన యాత్రను తలారిసింగి ఆశ్రమ పాఠశాల ఆవరణలో పచ్చ జెండాలు ఊపి సోమవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ గిరిజన విద్యార్థులంతా అన్ని రంగాల్లోను రాణించాలనే లక్ష్యంతో ప్రభుత్వ యంత్రాంగం పనిచేస్తుందన్నారు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో పరిణితి చెందాలన్న లక్ష్యంతో ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. గిరిజన విద్యార్థులంతా విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకుని ఉన్నత స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ, ఏటీడబ్ల్యూవో ఎల్.రజిని, పలు విద్యాలయాల హెచ్‌ఎంలు, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

శాంతించిన వరుణుడు



అనంతగిరి ఘాట్‌లో పొగమంచు కురుస్తున్న దృశ్యం

ఘాట్ ప్రాంతాల్లో దట్టంగా పొగమంచు

సాక్షి, పాడేరు: జిల్లాకు మాండూస్ తుఫాన్ ముప్పు తప్పింది. దాంతో సోమవారం మధ్యాహ్నం నుంచి వర్షం తగ్గుముఖం పట్టింది. గిరిజన ప్రాంతాల్లోని ఘాట్ రోడ్లలో ఉదయం నుంచి దట్టంగా పొగమంచు కురవడంతో పాటు పలుచోట్ల తేలికపాటి జల్లులు కురిశాయి. వాతావరణ పరిస్థితులు చల్లగా మారడంతో గిరిజన రైతులు ఆందోళన చెందినప్పటికి మధ్యాహ్నం తర్వాత వర్షం లేకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. ఇప్పటికే ఖరీఫ్ వరి పంటను కాపాడుకునే ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారు. వరి కుప్పలకు ప్లాస్టిక్ కవర్లను కప్పటి భద్రపరిచారు. వర్షాలు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పొగమంచు ఘాట్ ప్రాంతాల్లో కురిసినప్పటికి మండల కేంద్రాలు, ప్రధాన ప్రాంతాల్లో తీవ్రత తక్కువగానే ఉంది. అరకులోయలో 18 డిగ్రీలు, మినుములూరులో 16 డిగ్రీలు, చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో 17.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

జిల్లాలో 140 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

జిల్లా వ్యాప్తంగా 140 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్టు పాడేరు కలెక్టరేట్ అధికారులు తెలిపారు. అత్యధికంగా అనంతగిరి మండలంలోని 27 మిల్లీమీటర్లు, రాజవొమ్మంగిలో 11.6మి.మీ., మారేడుమిల్లిలో 10.2, అడ్డతీగలలో 9.4, వై.రామవరంలో 8.8, దేవీపట్నంలో 8.4, చింతూరులో 8.4, కొయ్యూరులో 8, అరకులోయలో 7.2, పాడేరులో 6.8, జి.మాడుగులలో 6.2, చింతపల్లిలో 5.4, డుంబ్రిగుడలో 5.2, గంగవరంలో 4.8, జి.కె.వీధిలో 4.8, హుకుంపేటలో 2.6, ముంచంగిపుట్టులో 2.2, రంపచోడవరంలో 1.2, పెదబయలులో 1.2 మిల్లీమీటర్ల వర్షపాతం చొప్పున నమోదైనట్టు వివరించారు.

'హై వే'గంగా పనులు

మన్యం అభివృద్ధికి వడివడిగా అడుగులు పడుతున్నాయి. ఈ ప్రాంతానికి రవాణా సౌకర్యాన్ని మెరుగు పరిచేందుకు చేపట్టిన 516ఈ నంబరు జాతీయ రహదారి నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ పనులు పూర్తయితే గిరిజన ప్రాంతం వర్తక, వాణిజ్య రంగాల్లో అభివృద్ధి సాధిస్తుంది. మైదాన ప్రాంతాలకు అటవీ ఉత్పత్తుల తరలింపు సులభతరం కానుంది.

- మొదటి ప్యాకేజీలో రూ.568.12 కోట్ల కేటాయింపు
- 113 కిలోమీటర్ల మేర 516ఈ జాతీయ రహదారి నిర్మాణం
- తీరనున్న ఆదివాసీల రవాణా కష్టాలు



రాజవొమ్మంగి మండలం జడ్డంగి వద్ద రోడ్డు నిర్మాణ పనులు

రాజవొమ్మంగి: అల్లూరి సీతారామరాజు జిల్లాలో రవాణా కష్టాలు తీరనున్నాయి. ఐ. పోలవరం నుంచి అడ్డతీగల, రాజవొమ్మంగి మండలాల మీదుగా కొయ్యూరు మండలంలోని కాకరపాడు వరకు ఎన్‌హెచ్ 516ఈ విస్తరణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ పనులకు సమాంతరంగా ఇంకా మరి కొన్ని జాతీయ రహదారులు మన్యాన్ని తాకుతూ రూపుదిద్దుకుంటున్నాయి. గిరిజనులు అనాదిగా కాలినడకన లేదా ఎడ్ల బళ్లపై తమ రవాణా అవసరాలను తీర్చుకునేవారు. ఆ తర్వాత అశ్వాలపైనే ఆధారపడ్డారు. ఇప్పటికీ జి. మాడుగుల, చింతపల్లి, అరకు, పాడేరు, పెదబయలు, ముంచంగిపుట్టు ప్రాంతాల్లో వారపు సంతకు వెళ్లాలన్నా, కొండచీపుర్లు, చిక్కుళ్లు, రాగులు, జొన్నలు, మిరియాలు, కాఫీ పండ్లు, తదితర అటవీ ఉత్పత్తులు ప్రధాన రహదారికి లేదా ప్రధాన మార్కెట్‌కు తరలించాలన్నా ఇవే శరణ్యం. ఈ కష్టాలకు చెక్ పెడుతూ నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మన్యంలోని ప్రధాన మండలాలు, గ్రామాలను కలుపుతూ నిర్మిస్తున్న జాతీయ రహదారి అందుబాటులోకి రానుంది. ఏదో విధంగా పండించిన పంటను జాతీయ రహదారి వరకు తమ సరకులను తరలిస్తే, ఆ తర్వాత రాష్ట్రంలో ఎక్కడికైనా తమ ఉత్పత్తులను తీసుకెళ్లి అమ్ముకునే వీలు కలుగుతుందని ఆదివాసీలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. రాజమహేంద్రవరం నుంచి విజయనగరం వరకు ఈ రహదారి రూపుదిద్దుకోనుంది. ప్యాకేజీల వారీగా ఐ.పోలవరం నుంచి కొయ్యూరు, అక్కడ నుంచి లబంసింగి, అక్కడ నుంచి పాడేరు ఇలా ఏజెన్సీ ప్రాంతలను కలుపుకుంటూ విజయనగరం వరకు సుమారు 400 కిలోమీటర్ల మేర ఈ రోడ్డు రయ్‌రయ్ మంటూ కొండలు, గుట్టలు దాటి వెళ్లనుంది.

రెండేళ్లలో ఎన్‌హెచ్ 516 ఈ రహదారి పూర్తి



ఎన్‌హెచ్ 516ఈ రహదారి పనులు ఒప్పంద ప్రకారం ఇప్పటి నుంచి రెండేళ్లలో పూర్తి కావాల్సి ఉంది. మొదటి ప్యాకేజీకి సంబంధించి ఐ. పోలవరం నుంచి కొయ్యూరు వరకు రూ.568.12 కోట్లతో 113 కిలోమీటర్ల మేర చురుగ్గా పనులు సాగుతున్నాయి. ఐ. పోలవరం నుంచి కొయ్యూరు వరకు నాలుగు మండలాల పరిధిలో 34 గ్రామాల మీదుగా ఈ రహదారి, అవసరమైన చోట వంతెనల నిర్మాణం చేస్తున్నాం. ఈ రహదారి పనులకు 76.7 కిలోమీటర్ల మేర అటవీ భూభాగం అవసరమని గుర్తించాం. ఎస్ఆర్‌సీ అనే సంస్థ టెండర్ దక్కించుకుని పనులు మొదలు పెట్టింది.

– చక్రవర్తి, ఎన్‌హెచ్ 516 అసిస్టెంట్ ఇంజినీర్

క్లుప్తంగా

ఎంపీ మాధవి ఔదార్యం


ఎంపీటీసీ భీమారావు సతీమణికి ఆర్థిక సాయం అందిస్తున్న ఎంపీ భర్త శివప్రసాద్

గూడెంకొత్తవీధి: మండలంలోని దావనాపల్లి ఎంపీటీసీ సభ్యుడు కొర్రా భీమారావు భార్య మంగమ్మ అనారోగ్యంతో విశాఖలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో శస్త్రచికిత్స జరిగి ప్రస్తుతం కోలుకుంటున్నారు. సమాచారం తెలుసుకున్న అరకు ఎంపీ గొడ్డేటి మాధవి తక్షణమే స్పందించి, రూ.20వేల ఆర్థిక సాయాన్ని అందించారు. ఆయా నిధులను ఎంపీ భర్త శివప్రసాద్ ఆస్పత్రికి వెళ్లి బాధితులకు అందజేశారు. ఢిల్లీలో ఉన్న ఎంపీ మాధవి ఫోన్ ద్వారా మంగమ్మను పరామర్శించి, అధైర్యపడొద్దని, అండగా ఉంటామని హామీ ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ నాయకులు లోవరాజు పాల్గొన్నారు.

హై ఓల్టేజీతో ఎలక్ట్రానిక్ ఉపకరణాలు దగ్ధం

రాజవొమ్మంగి: మండలంలోని బడదనాంపల్లిలో సోమవారం ఒక్కసారిగా వచ్చిన హైఓల్టేజీతో ఐదు ఇళ్లలో ఎలక్ట్రానిక్ ఉపకరణాలు కాలిపోయాయి. సంబంధిత శాఖ తమ గ్రామంలోని విద్యుత్ సమస్యలను పట్టించుకోకపోవడం వల్ల ఈ ఉపద్రవం సంభవించిందని బాధితులు చిర్లం అప్పన్న, రాజుబాబు, నీలాద్రి రాజుబాబు, గణేశ్వర్రావు, పుల్లి రాజుబాబు వాపోయారు. టీవీలు, బల్బులు, ఒక ఫ్రిజ్, ఒక ఇన్వెర్టర్ కాలిపోయాయని, తమకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

బ్యూటీషియన్ కోర్సు శిక్షణకు దరఖాస్తులు

అడ్డతీగల: రంపచోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అసిస్టెంట్ బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ పొందడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి పి.రోహిణి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రంపచోడవరం నియోజకవర్గ వ్యాప్తంగా ఏ ప్రాంతానికి చెందిన వారైనా శిక్షణ పొందవచ్చన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు మంగళవారం నుంచి రంపచోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్న ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ విద్యార్హత ఉన్న వారు అర్హులన్నారు. వివరాల కోసం 6301534435, 9492163247 సంప్రదించాలని సూచించారు.

మన్యంలో ఊపందుకున్న వరి కోతలు

తగ్గిన వర్షం... ధాన్యం తరలింపులో రైతులు నిమగ్నం


హుకుంపేటలో వరి కోతలో నిమగ్నమైన గిరిరైతులు


రాజవొమ్మంగిలో చిరుజల్లులకు తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు

సాక్షి, పాడేరు/రాజవొమ్మంగి: జిల్లా వ్యాప్తంగా వర్షాలు తగ్గుముఖం పట్టడంతో రైతులంతా ఖరీఫ్ వరి, ఇతర వాణిజ్య పంటల సేకరణలో సోమవారం మధ్యాహ్నం నుంచి నిమగ్నమయ్యారు. కోత దశలో ఉన్న వరి, చోడి, చిరుధాన్యాల పంటలను కోత కోసే పనుల్లో నిమగ్నమయ్యారు. అలాగే పలు చోట్ల గిరిజన రైతులు పంట భూముల్లోని వరి పనలను కల్లాలకు తరలించి వెంటనే నూర్పు పనులను కూడా చేపట్టారు. పంటలను కాపాడుకునే ప్రయత్నంలో వ్యవసాయశాఖ అధికారుల సూచనలను గిరిజన రైతులు పాటిస్తున్నారు. జిల్లాలోని అన్ని గ్రామ సచివాలయాల పరిధిలోని వ్యవసాయ అసిస్టెంట్లంతా ఖరీఫ్ వరి పంట భూములను పరిశీలిస్తు ఆయా సాగుదారులకు సూచనలు ఇస్తున్నారు.

రేపటి నుంచి యధావిధిగా కొనుగోళ్లు

జడ్డంగి ఆర్బీకే వద్ద మంగళవారం నుంచి తిరిగి కొనుగోళ్లు ప్రారంభిస్తామని ఏఓ రమేష్‌నాయుడు తెలిపారు. ఇప్పటి వరకు ఈ కేంద్రంలో 217 టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. వర్షం కారణంగా గింజల్లో నెమ్ము (తేమ) ఉంటుందన్న ఉద్దేశంతో ఆది, సోమవారాల్లో కొనుగోలు చేపట్టలేదన్నారు. కాగా రైతుల కళ్లాల్లోకి వెళ్లి సూచనలిచ్చామన్నారు. ఏవోతో పాటు జడ్డంగి వీఏఏ ప్రవీణ్, టెక్నికల్ అసిస్టెంట్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

పెదబయలు సంతకు ఒడిశా కూరగాయలు

80 శాతం పొరుగు రాష్ట్రానివే అమ్మకం


పెదబయలు సంతకు వ్యాన్లలో తీసుకొచ్చిన కూరగాయలు అమ్ముతున్న ఒడిశా వ్యాపారులు

పెదబయలు: స్థానిక వారపు సంతలో సోమవారం ఒడిశా కూరగాయలు విక్రయించారు. ఇక్కడ 80 శాతం కూరగాయలు ఒడిశా నుంచి తీసుకొచ్చిన కావడం గమనార్హం. ఒడిశా జైపూర్, జగదల్‌పూర్, ఛత్తీస్‌గఢ్‌కు ఆనుకుని సరిహద్దు ప్రాంతాల నుంచి వ్యాన్లు, లారీల్లో తీసుకొస్తున్నారు. గతంలో 80 శాతం కూరగాయలు పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల నుంచి మాలీలు తెచ్చి అమ్మకం చేసేవారు. మైదాన ప్రాంతం అనకాపల్లి నుంచి తెచ్చి విక్రయించేవారు. ఈ నేపథ్యంలో ఒడిశా నుంచి పెద్ద ఎత్తున కూరగాయలు తెచ్చి అమ్మకం చేయడంతో ఈ ప్రాంతాల నుంచి దిగుబడి తగ్గింది. ఒడిశా నుంచి వచ్చే కూరగాయలు గ్రేడింగ్ చేసి పాలిథిన్ కవర్లలో ప్యాక్ చేసి 10, 15, 20 కిలోల చొప్పున అమ్మకం చేస్తున్నారు. ఒక్క ప్యాకెట్ రూ.200 నుంచి రూ.500 వరకు కూరగాయల అనుగుణంగా ధర పలుకుతోంది. దీంతో ఇప్పటి వరకు కూరగాయలు పండించి అమ్మకం చేస్తున్న మాలీ రైతులు సైతం వీరి దగ్గరే కొనుగోలు చేసి విక్రయిస్తున్నారు. అనకాపల్లి ప్రాంతాల నుంచి కంటే ఒడిశా కూరగాయలు ధర కొంత తక్కువగా ఉందని పలువురు కొనుగోలుదారులు తెలిపారు.

9 మంది పందెంరాయుళ్లపై కేసు


పందెంరాయుళ్లతో ఎస్‌ఐ, పోలీసు సిబ్బంది

పెదబయలు: మండలంలోని సీకరి పంచాయతీ కొరుపల్లి గ్రామ శివారులో కోడిపందాల శిబిరంపై సోమవారం సాయంత్రం దాడి చేశామని ఎస్‌ఐ పులి మనోజ్‌కుమార్ తెలిపారు. 9 మంది పందెం రాయుళ్లను అదుపులో తీసుకుని, వీరి నుంచి రూ. 8,450 తోపాటు 9 పందెం కోళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

ద్విచక్ర వాహనం బోల్తా

ముగ్గురు యువకులకు గాయాలు

గూడెంకొత్తవీధి: మండలంలోని ఏబులం గ్రామం వద్ద సోమవారం మధ్యాహ్నం రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. ఏబులం గ్రామంలో ఒక కార్యక్రమానికి హాజరై వారి స్వగ్రామం రింతాడకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా అదుపుతప్పి వాహనం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో గబులంగి బాలకృష్ణ, లోవరాజు, తగ్గి రవి గాయపడ్డారు. వీరిలో ఇద్దరికి కాళ్లు విరిగాయి. స్థానికులు సమాచారం మేరకు 108 వాహనంలో చింతపల్లి ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు.

పేదల ఆకలి తీర్చిన సీఆర్పీఎఫ్ సిబ్బంది

వై.రామవరం: సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలో భాగంగా స్థానిక వారపు సంతలో సోమవారం సీఆర్పీఎఫ్ డి42 బెటాలియన్ అదనపు పోలీసు బలగాల ఆధ్వర్యంలో పేదలకు భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఒకపక్క వారపు సంత, మరోపక్క ప్రభుత్వ కార్యాలయాల పనులపై వచ్చిన 160 మంది పేదలకు వీటితోపాటు వాటర్ ప్యాకెట్లు అందించారు. బెటాలియన్ ఇన్‌స్పెక్టరు వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఐటీడీఏ వద్ద విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన

రంపచోడవరం: కాకవాడ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో బాలికలపై వేధింపులకు పాల్పడిన హెచ్‌ఎం భర్తపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం రంపచోడవరం ఐటీడీఏ ఎదుట వారి తల్లిదండ్రులు ఆందోళన నిర్వహించారు. తొలుత స్పందనలో అధికారులకు వినతి పత్రం ఇవ్వడానికి వెళ్తుండగా, వారిని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఐటీడీఏ ఎదుట ఆందోళనకు దిగారు. ఈ విషయం తెలుసుకుని పీవో సూరజ్‌గనోరే మాట్లాడారు. కేసు విచారణకు సీఐ, సీడీపీవోలను పంపిస్తున్నట్లు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

కొత్త ఓటర్ల నమోదు, తొలగింపులు పారదర్శకం

కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాలు


వీడియో సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి, పాడేరు: జిల్లా వ్యాప్తంగా కొత్త ఓటర్ల నమోదులు, తొలగింపులు, మార్పులు, చేర్పులన్నీ పారదర్శకంగా చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ రెవెన్యూ శాఖలోని ఎన్నికల విభాగం అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన కలెక్టరేట్ నుంచి జిల్లాలోని అన్ని డివిజన్ల సబ్ కలెక్టర్లు, తహసీల్దార్లు, ఇతర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. జూలై నుంచి నవంబర్ వరకు అందిన కొత్త ఓటర్ల దరఖాస్తులన్నింటిని సమగ్రంగా పరిశీలించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ సరైన కారణం లేకుండా కొత్త ఓటర్ల దరఖాస్తులను తిరస్కరించవద్దని సూచించారు. ఓటర్ల జాబితాలో ఓటర్ల తిరస్కరణ చేయొద్దన్నారు. జిల్లాలో 2,771 దరఖాస్తులు కొత్త ఓటర్లకు నమోదు కాగా, 1,950 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ నెల 22వ తేదీలోగా వీటిని పరిష్కరించాలన్నారు. అన్ని రాజకీయ పార్టీల నేతలతో మండల కేంద్రాల్లో సమావేశాలు నిర్వహించాలని, ఓటరు విధుల్లో వీఆర్‌ఏలు ఉండకూడదని, వారి స్థానంలోని అర్హులైన పై స్థాయి అధికారులను నియమించాలని ఆదేశించారు. కార్యక్రమంలో శిక్షణ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, ఎన్నికల పర్యవేక్షకురాలు నాగజ్యోతి పాల్గొన్నారు.

వర్షంతోనే ప్రాణాపాయం తప్పిందా!

సంతలో నేలకూలిన భారీ వృక్షం


వైఎస్సార్ సంతబయలు వద్ద రోడ్డుకు అడ్డంగా నేల కూలిన భారీ వృక్షం

అనంతగిరి: స్థానిక వైఎస్సార్ సంతబయలు వద్ద భారీ మామిడిచెట్టు ప్రధాన రహదారికి అడ్డంగా నేల కూలింది. చెట్టుకొమ్మలు పడటంతో విద్యుత్ తీగలు తెగి ఓ రేకుల షాపుపై పడ్డాయి. మంటలు వ్యాపిస్తుండడంతో స్థానికుల సమాచారంతో విద్యుత్ సిబ్బంది సరఫరా నిలిపివేశారు. ఆ సమయంలో వర్షం పడటం వల్ల వారపు సంతకు జనం ఎవ్వరూ రాలేదు. దీనికితోడు వాహన రాకపోకలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. చెట్టు పడిన ప్రదేశంలో ప్రతి సోమవారం 30 దుకాణాలను ఏర్పాటు చేసుకుని గిరిజనులు, మైదాన వ్యాపారులు వ్యాపారం సాగిస్తుంటారు. సంత జరిగే సమయంలో చెట్టుపడి ఉంటే ప్రాణాపాయం ఉండేదని స్థానికులు వాపోతున్నారు. సర్పంచ్ రూతు, జెడ్పీటీసీ గంగరాజు, పోలీస్ శాఖ ఆధ్వర్యంలోని చెట్టును తొలగింపు చర్యలు చేపట్టారు. విద్యుత్ సిబ్బంది పునరుద్ధరణ పనులు చేపడుతున్నారు.

'స్పందన'కు వినతుల వెల్లువ


స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న ఐటీడీఏ ఏపీవో శ్రీనివాసరావు

రంపచోడవరం: ఏజెన్సీలోని మారుమూల గ్రామాల నుంచి వచ్చిన గిరిజనుల సమస్యలపై సానుకూలంగా స్పందించాలని రంపచోడవరం ఐటీడీఏ ఏపీవో సీహెచ్. శ్రీనివాసరావు అన్నారు. ఐటీడీఏ సమావేశం హాలులో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. గ్రామాలకు సంబంధించిన, వ్యక్తిగత సమస్యలకు సంబంధించి 53 అర్జీలు వచ్చాయి. పోలవరం ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీపై పలువురు వినతులిచ్చారు. పాటు వై.రామవరం మండలం చింతలపూడి పంచాయతీ పరిధిలోని చింతకొయ్య-కొత్తాడ గ్రామాల మధ్య కన్నెరు వాగుపై వంతెన నిర్మించాలని సర్పంచ్ పల్లాల మంగిరెడ్డి అర్జీ అందజేశారు. అంటిలోవ, రాకోట గ్రామాల్లో మినీ అంగన్వాడీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. బొడ్డగండి -పాలగెడ్డ మధ్య రోడ్డు నిర్మాణానికి అటవీ అభ్యంతరాలు తొలగించాలని కోరారు. భూపతిపాలెం ప్రాజెక్టు నిర్వాసితులకు భూమికి భూమి ఇవ్వాలని కొత్తపాకల గిరిజనులు కోరారు.

రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు నక్కపల్లి విద్యార్థులు

నక్కపల్లి: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం నక్కపల్లిలో జరిగిన హాకీ పోటీల్లో నక్కపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలకు ఎంపికయ్యారని పీడీ కుందూరు రాజు తెలిపారు. అండర్ 14 విభాగంలో నిర్వహించిన ఈ పోటీల్లో ఉమ్మడి విశాఖ జిల్లాతో పాటు, అల్లూరి జిల్లా నుంచి ఇక్కడ జరిగిన పోటీలకు హాజరయ్యారన్నారు. వీరిలో నక్కపల్లి విద్యార్థులు త్వరలో అనంతపురంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారన్నారు. ఆయా విద్యార్థులను ఎంఈవో డీవీడీ ప్రసాద్, హెచ్‌ఎం రాణి లలిత బీఎస్ హాకీ క్లబ్ కార్యదర్శి తాతాజీ అభినందించారు.

రైవాడ కాలువలో గుర్తు తెలియని మహిళ మృతదేహం


గుర్తు తెలియని మహిళ మృతదేహం

సబ్బవరం: మండలంలోని గొటివాడ రెవెన్యూ అమలానికేతన్ సమీపంలోని రైవాడ కాలువలో గుర్తు తెలియని మహిళ మృతదేహం సోమవారం లభ్యమైంది. స్థానికుల సమాచారంతో సీఐ రంగనాథం సిబ్బందితో కలిసి మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం భౌతిక కాయాన్ని అనకాపల్లిలోని ప్రాంతీయ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతదేహం వద్ద లభ్యమైన ఆనవాళ్ల ఆధారంగా మహిళను గుర్తించేందుకు పోలీసులు ప్రయత్నాలు చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పోలీస్ స్టేషన్లకు సమాచారం అందించినట్టు సీఐ రంగనాథం తెలిపారు. మహిళ ఎడమ చేతిపై గంగునాయుడు అనే పేరు, కుడి చేతిపై ఒక పువ్వు పచ్చబొట్టుగా ఉన్నట్లు గుర్తించారు. మహిళ నల్లరంగు జాకెట్టు, బ్రౌన్ కలర్ లంగా ధరించిందని తెలిపారు. కాలువలో కొట్టుకువచ్చిన ఈ మృతదేహం కె.కోటపాడు, దేవరాపల్లి మండలాలకు చెందిన మహిళ అయి ఉంటుందని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఉదయం అదృశ్యం..సాయంత్రం క్షేమంగా ఇంటికి..

మునగపాక: ఉదయం అదృశ్యమైన విద్యార్థిని సాయంత్రం ఇంటికి క్షేమంగా చేరుకున్న సంఘటన మునగపాకలో సోమవారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మునగపాకకు చెందిన ఆడారి సాయి పరంజ్యోతి (12) స్థానిక ప్రియదర్శిని స్కూల్లో 6వ తరగతి చదువుకుంటుంది. ఎప్పటిలాగానే సోమవారం ఉదయం బ్యాగుతో స్కూల్‌కు వెళుతున్నట్టు ఇంటి నుంచి బయలుదేరింది. మధ్యాహ్నం 12 గంటల సమయంలో పరంజ్యోతి తల్లి స్కూల్‌కు క్యారేజీ తీసుకు వచ్చి ఆయాకు ఇచ్చి వెళ్లిపోయింది. మధ్యాహ్నం సమయంలో విద్యార్థులంతా భోజనం చేయగా ఒక క్యారేజీ మిగిలిపోవడాన్ని గమనించిన ఆయా సంబంధిత తల్లి వద్దకు వెళ్లి పరంజ్యోతి స్కూల్‌కు రాలేదని చెప్పడంతో తల్లిదండ్రులు కంగారుపడ్డారు. ఉదయం స్కూల్‌కు వెళ్లిన కూతురు స్కూల్‌కు వెళ్లలేదని తెలిసి చుట్టుపక్కల వెతికారు. ఫలితం లేకపోవడంతో తండ్రి ఆత్మారాం మునగపాక పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు మెయిన్‌రోడ్డులోని సీసీ ఫుటేజీలను పరిశీలించారు. విద్యార్థిని ఆచూకీ తెలియకపోవడంతో గాలింపు చర్యలు చేపట్టారు. కాగా సాయి పరంజ్యోతి సాయంత్రం నడుచుకుంటూ ఇంటికి రావడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. స్కూల్లో ఒత్తిడి తట్టుకోలేక పరంజ్యోతి తన స్నేహితుల ఇంటి వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉండి తిరిగి వచ్చినట్టు తల్లిదండ్రులు తెలిపారు. గతంలో కూడా స్కూల్‌కని వెళ్లి సాయంత్రం వరకు రాని సందర్భాలు ఉన్నాయని తండ్రి ఆత్మారాం తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు


జనపరెడ్డి శ్రీను, రాజుపేట


మునగపాక: మండలంలోని రాజుపేటకు చెందిన జనపరెడ్డి శ్రీను అనే వ్యక్తి అదృశ్యమైనట్టు సోమవారం మునగపాక పోలీసులకు ఫిర్యాదు అందింది. రాజుపేటకు చెందిన జనపరెడ్డి ఈ నెల 9న రాత్రి 8గంటలకు ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి శ్రీను ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు వెతికినా ఫలితం లేకపోవడంతో సోమవారం మునగపాక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

రంగురాళ్ల క్వారీ వద్ద అటవీశాఖ నిఘా

గొలుగొండ: ఆరిలోవ అటవీ ప్రాంతంపై రంగురాళ్ల క్వారీ వద్ద అటవీశాఖ సిబ్బంది సోమవారం నిఘా పెట్టారు. ఈ ప్రాంతంలో రంగురాళ్లు తవ్వుతున్నట్టు వచ్చిన సమాచారం మేరకు అధికారులు అప్రమత్తమయ్యారు. దీనిలో భాగంగా ఆదివారం రాత్రి క్వారీ ప్రాంతాలను గుర్తించి తవ్వకాలకు అడ్డుకట్ట వేసే ఏర్పాట్లను ముమ్మరం చేశారు.

25న ఘంటసాల శతజయంతి వేడుకలు

తెలుగు సినిమా, వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు


సమావేశంలో మాట్లాడుతున్న నాగభూషణం

అనకాపల్లి టౌన్: అమరగాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు శతజయంతి వేడుకలను ఈనెల 25న స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారి శ్రీ వివేకానంద ఫంక్షన్ హాల్లో నిర్వహిస్తున్నట్టు సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం అన్నారు. స్థానిక యర్రావారి వీధిలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వెంకటేశ్వరరావు శతజయంతిని పురస్కరించుకుని జిల్లా స్థాయి తెలుగు సినిమా, వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు విద్యార్థులకు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. జిల్లా స్థాయి తెలుగు సినిమా పాటల పోటీల్లో అన్ని వయస్సుల వారు పాల్గొనవచ్చని, వ్యాసరచన పోటీలకు చదువు..దాని ప్రాముఖ్యత అనే అంశంపై అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాల విద్యార్థులకు, చిత్రలేఖ పోటీలు (పర్యావరణ పరిరక్షణ) అనే అంశంపై 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. విజేతలకు 25న బహుమతులు అందజేస్తామన్నారు. మరిన్ని వివరాలకు 9493256300 నంబర్‌ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి ఉజ్జి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు వినకోట నిలేశ్ గుప్తా, సహాయ కార్యదర్శి అల్లాడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

శ్రావణ్‌కుమార్ మృతదేహం లభ్యం


శ్రావణ్‌కుమార్ మృతదేహాన్ని జలాశయం నుంచి బైయటకు తీసుకొస్తున్న ఎస్‌ఐ దామోదరనాయుడు, సిబ్బంది

- పెద్దేరు జలాశయంలో తేలిన వైనం
- మృతదేహాన్ని బయటకు తీసిన పోలీసు సిబ్బంది


శ్రావణ్‌కుమార్ (ఫైల్)

మాడుగుల రూరల్: కుటుంబ సమస్యల మూలంగా రావిపాలెం వద్ద, పెద్దేరు జలాశయంలో దూకి ఆత్మహత్య చేసుకున్న కింతలి వల్లాపురం గ్రామానికి చెందిన దామరౌతు శ్రావణ్‌కుమార్ (25) మృతదేహం సోమవారం ఉదయం బయటపడింది. జలాశయం మెదటి గేటు వద్ద ఉదయం 7 గంటలకు మృతదేహం తేలడంతో వెంటనే ఆయన కుటుంబ సభ్యులు స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. శ్రావణ్‌కుమార్ ఈ నెల 8వ తేదీ అర్ధరాత్రి 2.30 గంటల సమయంలో తన ఫోన్ నంబర్ వాట్సప్ స్టేటస్‌లో 'ఐ మిస్ యు, కొన్ని సమస్యలకు పరిష్కారం ఉంటుంది, కానీ నా సమస్యకు పరిష్కారం లేదు, దొరకలేదు.. అందుకు ఇంతవరకు ఓపికగా ప్రయత్నించి, ఓపిక పట్టా, అయినా పరిష్కారం దొరకలేదుని, ఇక నాకు ఓపిక లేదు.. ఆశ లేదు. బై' అని ఆయన బంధువులకు నేను జాలంపల్లి రిజర్వాయరులో దూకి చనిపోతున్నానని మెసేజ్ పెట్టాడు. ఈ మెసెజ్‌ను చూసిన శ్రావణ్‌కుమార్ బావ నాగరాజు, అక్క సుజాత, కలిసి 9వ తేదీ ఉదయం ఐదున్నర గంటల సమయంలో పెద్దేరు జలాశయం ఒడ్డుకు వారి బంధువులతో పాటు కలిసి వెళ్లి చూడగా, అక్కడ స్కూటీ, దాని మీద చెప్పులు కనిపించాయి. అరుణ్‌కుమార్ జాడ లేదు. దీంతో ఈ విషయం పోలీసులకు తెలియపరిచారు. పోలీసులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో పాటు తహసీల్దారు సూచనల మేరకు ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది రంగంలోకి దిగి జలాశయంలో రెండు పడవల ద్వారా గాలింపు చర్యలు చేపట్టారు. ఈ నెల 9, 10, 11, తేదీల్లో అలాగే స్కూబార్ సహాయంతో 30 అడుగుల లోతుకు వెళ్లి గాలించారు. జోరు వానను కూడా లెక్క చెయ్యకుండా గాలింపు చర్యలు చేపట్టారు. అయినా సరే మృతదేహం ఆచూకీ లభ్యం కాలేదు. సోమవారం ఉదయం మృతదేహం జలాశయంలో పైకి తేలడంతో వెంటనే స్థానిక ఎస్‌ఐ పి. దామోదరనాయుడు, సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది, పడవ ద్వారా మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. శవ పంచనామా జరిపి, అనకాపల్లి ఆస్పత్రికి పోస్టుమార్టంకు తరలించామని ఎస్‌ఐ తెలిపారు. శ్రావణ్‌కుమార్ తండ్రి కొండబాబు గతంలో మృతి చెందగా, తల్లి వరహాలమ్మ, సోదరుడు కోటీశ్వరావు వున్నారు. ఇద్దరు అక్కలకు వివాహం అయింది. డిగ్రీ వరకు చదువుకున్న శ్రావణ్‌కుమార్, ఇటీవల కంప్యూటర్ శిక్షణ కూడా పొందాడని కుటుంబ సభ్యులు తెలిపారు.